క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

పొదలకూరు: పట్టణంలోని అమరావతి స్కూల్లో వసంత పంచమిని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సరస్వతీదేవికి పూజలు జరిపి, చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. 46 మందికి పలకలు, జ్ఞాపికలను అందజేసినట్లు కరస్పాండెంట్ కె.సురేష్ తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



పొదలకూరు: మండలంలోని విరువూరు, ప్రగతి నగర్‌లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత మండల కమిటీ అధ్యక్షుడు పెంచలనర్సయ్య మాట్లాడుతూ వేమన పద్యాలు జ్ఞాన జ్యోతిని వెలిగిస్తాయని పేర్కొన్నారు. వేమన నీతి పద్యాలను తాము ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

నేత్రదానం


కృష్ణయ్య (ఫైల్)

విడవలూరు: మండలంలోని మన్మథరావుపేటకు చెందిన చెలంచర్ల కృష్ణయ్య (60) సోమవారం మృతి చెందారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను మనసేవా సంస్థ చైర్మన్ దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్‌కు దానం చేశారు. టెక్నీషియన్లు వేణు, వెంకటేశ్వర్లు సేకరించారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి

నెల్లూరు (పొగతోట): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.19750 కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు సివిల్ సప్లయ్స్ డీఎం కార్యాలయంలో అసిస్టెంట్ డీఎం సురేంద్రకు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. నేతలు లక్ష్మీనారాయణ, సురేష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిపై అలిగి కుమారుడి పరార్

నెల్లూరు(క్రైమ్): తల్లిపై అలిగి కుమారుడు పరారైన ఘటనపై కేసును నవాబుపేట పోలీసులు సోమవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మైపాడు రోడ్డులోని శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న దివ్య కుమారుడు అశ్విన్ డిగ్రీ చదువుతూ మధ్యలో మానేశారు. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటున్నారు. చదువుకోమని తల్లి రోజూ చెప్పుండటంతో అలిగి ఇంటి నుంచి గత నెల 27న ఎటో వెళ్లిపోయారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): మద్యానికి బానిసై భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న భర్తపై కేసును వేదాయపాళెం పోలీసులు సోమవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. టైలర్స్ కాలనీకి చెందిన రాజ్యలక్ష్మి, వెంకటశివనారాయణ దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కరెంట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే ఆయన మద్యానికి బానసయ్యారు. భార్యను శారీరకంగా, మానసికంగా వేధించసాగారు. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు సూచించినా, ఆయనలో ఎలాంటి మార్పురాలేదు. దీంతో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఎస్సై ముత్యాలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9న మిస్ నెల్లూరు ఆడిషన్స్


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని సితార రెస్టారెంట్‌లో మిస్ నెల్లూరు ఆడిషన్స్‌ను ఈ నెల తొమ్మిదిన, గ్రాండ్ ఫినాలేను మార్చి రెండున బ్లాసం బ్లూ ఈవెంట్స్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని లెక్చరర్స్ కాలనీలో బ్రోచర్లను సోమవారం ఆవిష్కరించారు. వివరాలకు 91107 99510 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కళాసంఘాల కన్వీనర్ దోర్నాల హరిబాబు, శ్రీదేవి, సుప్రియ, మహాలక్ష్మి, శర్వాణి, పవన్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పోలీస్ క్వార్టర్స్


పోలీస్ క్వార్టర్స్


ఏపుగా పెరిగిన చెట్లు

- అసౌకర్యమైన చోట నిర్మాణం
- మొదట్నుంచి ఇదే దుస్థితి

కొడవలూరు: పోలీస్ సిబ్బంది కోసం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన క్వార్టర్స్ నిరుపయోగంగా మారాయి. అసౌకర్యమైన చోట నిర్మించడంతో ఇక్కడ ఉండేందుకు సిబ్బంది ముందుకు రాలేదు. ఫలితంగా మొదట్నుంచి ఇదే దుస్థితి నెలకొంది.

కిలోమీటర్ దూరంలో..

వాస్తవానికి పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో సిబ్బంది నివాసం ఉంటే అత్యవసరాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీనికి అనుగుణంగా స్టేషన్ల పక్కనే క్వార్టర్స్‌ను నిర్మిస్తారు. అయితే ఇక్కడ మాత్రం కిలోమీటర్ దూరంలో నిర్మించారు. పైగా ఎలాంటి వసతుల్లేవు. ఏ చిన్నపాటి అవసరానికైనా నార్తురాజుపాళెం వెళ్లాల్సిన పరిస్థితి. పైగా వీటిని నిర్మించిన చోట ఎలాంటి నివాసాల్లేవు. కేవలం స్థలాన్ని ప్రభుత్వం కేటాయించడంతో రూ.లక్షలు కుమ్మరించి నిర్మించేశారు. ప్రారంభంలో ఒకట్రెండు కుటుంబాలు చేరినా, అసౌకర్యాల నడుమ ఉండలేక నెల్లోనే ఖాళీ చేసేశారు. అప్పట్నుంచి అవి అలాగే ఉండిపోయాయి. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో వీటి మధ్య చెట్లు దట్టంగా పెరిగి క్వార్టర్స్ భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది.

జగనన్న కాలనీ ఏర్పాటు

పోలీస్ క్వార్టర్స్‌కు ఎదురుగా ఉన్న ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేసి జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. ఇక్కడ వందకుపైగా నిర్మాణాలు జరిగి పలువురు నివాసం ఉంటున్నారు. వీరి కోసం దుకాణాలూ వెలిశాయి. పోలీస్ క్వార్టర్స్‌లో మొక్కలను తొలగించి స్వల్ప మరమ్మతులు చేపడితే నివాసం ఉండేందుకు సిబ్బంది ముందుకొచ్చే అవకాశం ఉంది. ఈ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భూ ఆక్రమణ తొలగింపు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ భూమి ఆక్రమణను పోలీసుల సాయంతో దేవస్థానాధికారులు సోమవారం తొలగించారు. నెల్లూరు రూరల్ పరిధిలోని జొన్నవాడ రేవు వద్ద ఆలయ భూమిని కొందరు ఆక్రమించి నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ వేణుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

కుష్టుపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న నరసారెడ్డి


కొడవలూరు: కుష్టుపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా పారామెడికల్ అధికారి నరసారెడ్డి పేర్కొన్నారు. గండవరం, కొత్తవంగల్లు గిరిజన కాలనీల్లో సోమవారం పర్యటించిన ఆయన కుష్టుపై అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా, పీహెచ్‌సీని సంప్రదించాలని కోరారు. కుష్టును ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నివారించొచ్చని చెప్పారు. ఏఎన్‌ఎంలు శాంతకుమారి, మమత, సుష్మ, ఎమ్మెల్‌హెచ్‌పీ జాస్మిన్, హెచ్‌ఏలు నాగయ్య, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దూరంగా ఉండే బడికి పంపించలేం


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ముత్తుకూరు: 'మా పిల్లలు ఇక్కడున్న ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. సంఖ్య తక్కువగా ఉందని బడిలో 3, 4, 5 తరగతులను తీసేసి దూరంగా ఉండే మరోచోటుకు వెళ్లాలంటున్నారు. ఈ ప్రక్రియను ఉపసంహరించుకోవాలి' అని ముత్తుకూరు బీసీ కాలనీవాసులు, ఎస్‌ఎంసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓ హేమసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో ప్రాథమిక పాఠశాల ఎంతోకాలంగా కొనసాగుతోందని, దాని స్థాయి తగ్గించవద్దని, తరగతులను తొలగించవద్దని విజ్ఞప్తి చేశారు. దూరంగా ఉండే బడికి పిల్లలను పంపలేమని స్పష్టం చేశారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి అవార్డులు


అవార్డు అందుకుంటున్న సీఈఓ

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న ఎస్ఈఐఎల్ ఎనర్జీకి నాలుగు బీబీఎస్ (బిహేవియర్ బేస్డ్ సేఫ్టీ) ప్రతిష్టాత్మక అవార్డులు దక్కాయి. ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన 9వ వార్షిక జాతీయ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఎస్ఈఐఎల్ ఎనర్జీకి వరుసగా రెండోసారి 'ప్లాటినమ్ బెంచ్ మార్కింగ్' అవార్డు అందుకొంది. అలాగే, బీబీఎస్ విధానం అమలు చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా సీఈఓ రాఘవ త్రివేదికి లీడర్ షిప్ అవార్డు ప్రదానం చేసినట్టు ప్రాజెక్ట్ వర్గాలు వెల్లడించాయి. అలాగే ప్రాజెక్ట్ భద్రతా కార్యక్రమాలకు సహకారం అందజేసిన ఆపరేషన్స్ ఏజీఎం నిజి జేమ్స్, సీనియర్ ఇంజినీర్ జె.వెంకటరామ్‌జీలకు ఉత్తమ బీబీఎస్ అబ్జర్వర్ అవార్డులు స్వీకరించారు.

దివ్యాంగులకు స్క్రీనింగ్ టెస్ట్


పత్రాలను పరిశీలిస్తున్న వైద్యులు

కోవూరు: పింఛన్లు అందుకుంటున్న దివ్యాంగులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఎంపీడీఓ శ్రీహరి, వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటచలపతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడారు. సదరమ్ స్క్రీనింగ్ పరీక్షలను వారం పాటు నిర్వహించనున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఎస్టీఎస్ ఆధునికీకరణ పనుల కారణంగా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పలు గ్రామాలతో పాటు పట్టణంలో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని డీఈ సతీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ వినియోగదారులకు త్రీఫేజ్ సరఫరాను ఉదయం నాలుగు నుంచి ఎనిమిది వరకు.. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు వరకు ఇవ్వనున్నామని వివరించారు.

6న సర్వేపల్లి ఉద్యాన నర్సరీలో బహిరంగ వేలం

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి వద్ద నున్న ఉద్యాన నర్సరీలో ఈనెల 6వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఎంవీ సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీలో ఉన్న 600 మామిడి చెట్లు, 40 సపోటా చెట్లు, 10 ఉసిరి చెట్లకు సంబంధించి ఫల సాయం హక్కుల కోసం వేలం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు రూ.500 చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు మండల ఉద్యాన శాఖ అధికారి ఫోన్ నంబర్ 79950 86940ను సంప్రదించాలన్నారు.

పరీక్షల్లో ఎనిమిది మంది డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన పీజీ మొదటి సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో ఎనిమిది మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 2,118 మందికి గానూ 1,913 మంది హాజరైనట్లు వెల్లడించారు. వీఆర్ ఐపీఎస్ కళాశాలలో ఒకరిని డిబార్ చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 1,755 మందికి గానూ 1,635 మంది హాజరయ్యారన్నారు. కావలిలోని వీఎస్‌యూ పీజీ కళాశాలలో ఏడుగురిని డిబార్ చేసినట్లు వెల్లడించారు.

- వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో నిర్వహించిన డిగ్రీ రెండు, ఐదో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షల్లో 155 మందికి 147 మంది హాజరైనట్లు తెలిపారు.

పొదలకూరులో ఎమ్మెల్యే పర్యటన

పొదలకూరు: పట్టణంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీనివాస లేఅవుట్లో రూ.20 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న బీసీ బాలికల హాస్టల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌ను ప్రారంభించారు.

చెక్కు పంపిణీ



పొదలకూరు: స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్ సైన్స్ టీచర్, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు రూ.30 వేల చెక్కును సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతుల మీదుగా విద్యా కమిటీ చైర్మన్‌కు సోమవారం అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు కింద అందజేసిన రూ.20 వేలకు మరో రూ.10 వేలు కలిపి మొత్తం రూ.30 వేలను ఇచ్చారు. సుధాకర్ తల్లి వెంకమ్మ జ్ఞాపకార్థం పొదలకూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థికి ప్రతి ఏడాది ఆగస్టు 15న రూ.30 వేలకు వడ్డీ కింద వచ్చే మొత్తాన్ని ప్రోత్సాహకంగా అందజేయడం జరుగుతుందన్నారు.

చిన్న శేషవాహనంపై వెంకటేశ్వరుడి ఊరేగింపు



పొదలకూరు: పట్టణంలోని అయ్యప్ప నగర్ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్స బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్వామి, అమ్మవార్లను చిన్న శేషవాహనంపై ఊరేగించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, మేలుకొలుపు, తోమాలసేవ, ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, పంచగవ్య ఆరాధన, 10 గంటలకు అగ్నిప్రతిష్ట, ధ్వజపత ప్రతిష్ట, గరుడ హోమం, 11 గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వివిధ పూజలు జరిగాయి. రాత్రి పెద్ద శేషవాహనంపై అత్యంత వైభవంగా గ్రామోత్సవం జరిగింది.

టీడీపీకి చివరి విజయమిదే..


మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన ప్రసన్నకుమార్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ ఎన్నికల్లో అనైతిక రాజకీయం చేసి గెలుపొందిన టీడీపీకి ఇవే ఆఖరి విజయంగా భావించొచ్చని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఇతర పార్టీల తరఫున గెలుపొందిన వారిని భయపెట్టి టీడీపీలో చేర్చుకున్నారని ఆరోపించారు. తాము పోటీలో ఉంటామని కౌన్సిలర్లు చెప్పడంతో ఎన్నికల బరిలోకి దిగామని చెప్పారు. ఒక్క రోజు వ్యవధిలోనే కొంత మంది కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకొని వారిని బరిలోకి దింపే దీనస్థితి టీడీపీకి ఏర్పడిందని విమర్శించారు. పార్టీ ఫిరాయించిన వారికి విప్ జారీ చేయడంతో తమ పార్టీ అభ్యర్థులుగా ప్రకటించుకునే అవకాశం అధికార పార్టీకి లేకుండాపోయిందని తెలిపారు. ఓ పార్టీ తరఫున గెలుపొంది ఫిరాయించిన వారిపై అనర్హత వేటు వేసే సౌలభ్యం ఉందనే విషయం మున్సిపల్ మంత్రికి తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. వీరిపై అనర్హత వేటు తప్పక పడుతుందని స్పష్టం చేశారు. కష్టకాలంలో తమ వెంట నిలిచిన ఆరుగురు కౌన్సిలర్లకు తమ పార్టీ అధికారంలోకి వచ్చాక సముచిత స్థానాన్ని కల్పిస్తామని ప్రకటించారు. జిల్లాలో అన్యాయంపై పోరాటం చేస్తామని, దౌర్జన్యంగా ప్రవర్తించే వారిపై చర్యలుంటాయని పేర్కొన్నారు. తమ పార్టీ కార్యకర్తలు, నేతలపై దౌర్జన్యం చేసే వారు వీధుల్లో తిరగలేరని హెచ్చరించారు. అక్రమ పద్ధతిలో విజయం సాధించినా, టీడీపీలో విజయోత్సాహం కనిపించడంలేదన్నారు. రానున్న ఎన్నికల్లో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని లక్ష ఓట్లకుపైగా మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

నగర పంచాయతీ హోదా జగన్ చలువే

బుచ్చిరెడ్డిపాళేనికి నగర పంచాయతీ హోదాను నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన అంశాన్ని ప్రసన్నకుమార్‌రెడ్డి గుర్తుచేశారు. 2021లో నిర్వహించిన ఎన్నికల్లో తమ పార్టీ 18 స్థానాలను గెలుచుకోగా, టీడీపీ రెండు స్థానాలకే పరిమితమైన అంశాన్ని ప్రస్తావించారు. వెన్నుపోటుదారులను లోబర్చుకొని తమ విజయంగా టీడీపీ చెప్పుకోడం సిగ్గుచేటని విమర్శించారు. కౌన్సిలర్లను తన ఇంటి మనుషులుగా చూశామని, పార్టీని వీడి వెళ్లడంతోనే వారి బుద్ధి బయటపడిందన్నారు. పార్టీ మారిన వారికి అక్కడ గౌరవం దక్కుతుందానని ప్రశ్నించారు. నిజాయతీగా నిలిచిన ఆరుగురు కౌన్సిలర్లకు పాదాభివందనం చేస్తున్నానని తెలిపారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, గొల్లపల్లి బాబూరావు, పార్టీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వింత రాజకీయం


మాట్లాడుతున్న చలపతిరావు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఇద్దరు వైస్ చైర్మన్ల ఎన్నికల్లో వింత జరగడం విస్మయం కలిగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో తాము ఎవర్నైతే వైస్ చైర్మన్‌గా ఎంపిక చేయాలనుకున్నామో, వారినే బీ ఫారం లేకుండా పోటీలో నిలిపి మద్దతు తెలిపిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కౌన్సిల్‌లోని ఇద్దరు టీడీపీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. తమ పార్టీ తరఫున పోటీ చేసేందుకు బీ ఫారం సైతం సిద్ధం చేసుకున్న వ్యక్తిని రాత్రికి రాత్రే టీడీపీలో చేర్చుకొని ఎన్నికల్లో నిలిపి గెలిపించి కొత్త ఆచారానికి తెరదీశారని ఎద్దేవా చేశారు. ఎన్నిక సమయంలో తమ పార్టీ అభ్యర్థులు మాత్రమే కండువాలను కప్పుకొని హాజరయ్యారని గుర్తుచేశారు. పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటేసే విషయమై ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో గాథ


సమస్యలు వింటున్న కృష్ణకాంత్

- పరిష్కరించాలని ఎస్పీకి అభ్యర్థన

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగాల పేరిట మోసం.. పెళ్లి చేసుకొని కాపురానికి తీసుకెళ్లడంలేదు.. ఆస్తి లాగేసుకొని ఇంటి నుంచి గెంటేశారు.. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటి గాథ. సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని అభ్యర్థించారు. చట్టపరిధిలో సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ కృష్ణకాంత్ హామీ ఇచ్చారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 95 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వీటిని పరిశీలించిన ఆయన ఆయా ప్రాంత పోలీస్ అధికారులతో మాట్లాడి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీటీసీ, మహిళా స్టేషన్ డీఎస్పీలు గిరిధర్‌రావు, చెంచురామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్పీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- కావలికి చెందిన భరత్‌కుమార్ సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగాలిప్పిస్తానని తనతో పాటు సహచరుల వద్ద రూ.9.6 లక్షలను తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా, ఉద్యోగాలిప్పించకపోవడంతో ఇటీవల నిలదీయగా, చంపుతామని బెదిరిస్తున్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని జలదంకికి చెందిన ఓ యువకుడు కోరారు.
- అనంతసాగరానికి చెందిన అమానుల్లా, తాను ప్రేమించుకున్నాం. పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాం. కొద్ది రోజుల అనంతరం అమానుల్లా చెప్పాపెట్టకుండా చెన్నై వెళ్లిపోయారు. కాపురానికి తీసుకెళ్లాలని కోరినా పట్టించుకోవడంలేదు. తనకే సంబంధం లేదనే రీతిలో వ్యవహరిస్తున్నారు. కౌన్సెలింగ్ చేసి కాపురాన్ని చక్కదిద్దాలని వివాహిత విజ్ఞప్తి చేశారు.
- తనకు ప్రభుత్వమిచ్చిన భూమిని సాగుచేసుకోనీయకుండా సంగానికి చెందిన సూర్యనారాయణ అడ్డుపడుతున్నారు. కులంపేరుతో దూషిస్తూ ఇబ్బంది పెడుతున్నారు. అతని వేధింపులతో నా భర్య మరణించారు. విచారణ జరిపి న్యాయం చేయాలని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అభ్యర్థించారు.
- కుటుంబకలహాల నేపథ్యంలో భర్త, అత్తింటి వారు నా 18 నెలల బిడ్డను బలవంతంగా తీసుకెళ్లారు. స్థానిక పోలీసులను సంప్రదించినా ప్రయోజనం లేదు. విచారణ జరిపి బిడ్డను తన చెంతకు చేర్చాలని దగదర్తి మండలానికి చెందిన ఓ మహిళ వేడుకున్నారు.
- నా పేరుపై ఉన్న ఇంటిని తన పేరుపై చిన్నకుమారుడు రాయించుకున్నారు. ఇంటి నుంచి గెంటేశారు. నిలువ నీడలేక ఇబ్బంది పడుతున్నా. న్యాయం చేయాలని దర్గామిట్టకు చెందిన ఓ వృద్ధురాలు కోరారు.
- కొంతకాలం క్రితం నా ఇంట్లో చోరీ జరిగింది. ఉన్నదంతా దోచేశారు. పొదలకూరు పోలీసులు కేసు నమోదు చేసినా, నేటికీ ఎలాంటి పురోగతి లేదు. చోరీ సొత్తును రికవరీ చేసి అందించాలని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి విజ్ఞప్తి చేశారు.